అతుకుల బొంత

బజారులో నడిచే జనాలను అదే పనిగా చూస్తున్న అన్నపూర్ణమ్మ అరుగుమీద కూచుందే కాని, మనసంతా అల్లకల్లోల సముద్రం లాగుంది. నుదుటి గీతలు అనుభవం తాలూకు హద్దులుగా మిగిలాయి.

జీవితమంటే రంగుల అతుకుల బొంత అని అప్పుడనుకునే అవకాశం రాలేదు.

ఆశల పల్లకిలో ఊరేగుతూ పదిహేను సంవత్సరాలు భర్త చల్లని నీడలో హృదయపుష్పం వేయి రేకులుగా విప్పుకుంది. అప్పుడు అదృష్ట జాతకమంటే తనదే అనుకుంది. ముద్దుగా ముగ్గురు పిల్లలకు తల్లైంతర్వాత తనను ఒంటరిదానిగా మిగిల్చి పరలోకయాత్రకెళ్ళిన భర్త జ్ఞాపకాలు గుండెల్ని పిండేస్తుంటే తనంతటి దురదృష్టజాతకురాలీ లోకంలో ఎవ్వరూ లేరనుకుంది. భూ నభోంతరాలు ఏకమై తనమీద పడినా గుండె రాయి చేసుకోగలిగింది.

ప్రయత్నానికి పట్టుదల జోడైంది. అష్టకష్టాలను ఆత్మస్థైర్యం ఎదురించింది. భర్త ఆశయాల కనుగుణంగా పిల్లల్ని ప్రయోజకులుగా చేయగలిగినందుకు అసలు సిసలైన అదృష్టం తనదే నన్పించింది.

పైవాడి లీలలకు పరాకాష్ట మానవ జీవన చదరంగమే. అల్లా అనుకునేందుకు బోలెడన్ని ఆధారాలున్నాయి. పెద్ద కొడుకు-అదే అన్నపూర్ణమ్మ కూచున్న అరుగు బాపతు రామనాథం సంసారాన్ని ట్యూషన్ల బండిమీద చాకచక్యంగా నడిపించగల సత్కారు బడిపంతులు. మాథ

మేటిక్స్ అనే బండరాయిని బోధనాపటిమతో పిండిచేసి ఉదాహరణలనే తీపి కలిపి విద్యార్థులకు తినిపిస్తాడు.

అణుకువ అంటే ఏమిటో పెద్దకోడలు రాజ్యలక్ష్మిని చూచి నేర్చుకోవాల్సిందే. తాను అంట్లు తోముతానంటే—

"అత్తగారిచేత అంట్లు తోమించే దుర్మార్గం నాకంటగట్ట వద్దత్తయ్యా!" అని వారిస్తుంది.

వంటలో సాయం చేస్తానంటే-

"ఈ పనులకు నేనున్నానుగదత్తయ్యా! మీరలా కూచోండి!" అంటూ చేతులు జోడిస్తుంది.

నీళ్ళు చేదేందుకు బావి దగ్గరకెళ్తే

"పెద్ద ప్రాణం, మీకెందుకు శ్రమ!" అంటూ బొక్కెన లాక్కుంటుంది.

"ఏ పనీ చెయ్యకుండా ఎలా ఉండగలనమ్మా?" అని విసుక్కుంటే-

"ఇన్నాళ్లు రెక్కలు ముక్కలు చేసుకుని కొడుకుల్ని చదివించారు. పెళ్ళిళ్ళు చేశారు. ఇక విశ్రాంతి తీసుకోండత్తయ్యా!" అంటుంది.

''పనిచేసే రెక్కలూ, పారాయణంచేసే నోరూ ఊరుకోవురా రామనాథం!" అందోసారి కొడుకుతో.

"పనులు మాకప్పజెప్పి నువ్వు పారాయణం చేసుకోమ్మా! పూజలకూ, హరికథలకూ వెళ్ళు. మనుమలూ, మనమరాళ్ళతో ఆడుకోవే!" ఉచిత సలహా పారేశాడు.

అంటే.... రెక్కల్ని కట్టగట్టి అటకెక్కించాలన్నమాట. పని మానేసిన యంత్రం తుప్పు బట్టినట్టు తన రెక్కలు నిర్వీర్యమైపోతే రోగాలూ, రొచ్చులూ చుట్టుకోవా? పెద్దకొడుకూ, కోడలూ ఓ పథకం

ప్రకారం తన ఆయుర్దాయాన్ని తగ్గించాలనుకుంటున్నారా? ఈ వయసులో ఏ పనీ చెయ్యకపోతే శరీరానికి వ్యాయామమెక్కడిదీ?

ఏమాటకామాటే చెప్పుకోవాలి. రెండవవాడు నారాయణమూర్తింట్లో ఎంత పన్జేసినా అడ్డుచెప్పేవారుండరు. వాడి భార్య నాగమణి నవ్వితే నవరత్నాలు రాల్తాయేమో ననిపిస్తుంది. సన్నని నడుము, సన్నజాజి ముక్కూ, తళుక్కుమనే ఒంటిరాయి ముక్కుపుడక.... లక్ష్మీదేవిలా ఉంటుంది.

"నేను స్నానానికెళ్తున్నాను. కాస్త పొయ్యిమీద బియ్యంపడెయ్యండత్తయ్యా!" అనో —

"పిల్లల బడికి టైమైపోతుంది. వాళ్ళకు మీరు నీళ్ళు పోస్తేనే తృప్తి...." అంటూనో ఎన్నో పనులు పురమాయిసుంది, కడుపులో చొచ్చినట్టు.

నారాయణమూర్తి గూడా అంతే.

"బేరాలు చెయ్యడం మాకు చేతగాదు. కాస్త నువ్వే బజారుకెళ్ళి కూరగాయలు తేమ్మా!"అని సంచి చేతికందిస్తాడు.

"నీ కోడలి కసలు పైసలంటే ఫర్వానే లేదు. నెలకెన్ని సరుకులు తేవాలో అసలే తెలీదు. ఆ సరుకులేవో నువ్వే కొనుక్కు రామ్మా!" అని అతడు బతిమాల్తుంటే తన అంతరంగం మబ్బుల ఆకాశాన్ని చూచిన మయూరంలా గంతులేస్తుంది.

''అమ్మా! నువ్వు నా ఇంట్లో ఉంటే నాకు కొండంత ధైర్యమే. నువ్వెప్పటికీ ఇక్కడే ఉండిపో. తల్లి సేవ చేసుకునే భాగ్యం కలిగించమ్మా!" అంటూ బిస్కెట్ తింటున్న పిల్లాడిలా ఇదైపోతాడు.

'నేనంటే వాడికెంత ప్రేమనో' అనుకుంది.

కాని....వాని వృత్తీ, ప్రవృత్తీ అంతా వ్యాపారమే, తియ్యని మాటలతో ఎదుటివారిని అవలీలగా సీసాలోకి దించేస్తాడు. ప్రతి చిన్న విషయాన్ని గూడా డబ్బుతోనే చూస్తాడన్న సంగతి ఆలస్యంగా అర్థం మైంది.

ఓ రోజు ... తీరిగ్గా కూర్చునుంది. ఆక్సిడెంటులో పోయిన భర్త అంగలార్పులు కళ్ళముందు మెదిలి గుండెల్ని మెలిపెడ్తున్నాయి. చివరి శ్వాస వదిలే ముందు అదని పెదాలు చీల్చుకువచ్చిన మాటలు చెవుల్లో గింగురుమన్నాయి.

''పూర్ణా! మనకు ముగ్గురు కొడుకుల నిచ్చిన ఆ దేవుడు ఒక్క ఆడ నలుసునైనా ప్రసాదించలేదని కుంగిపోయావు కదూ! మన కొడుకు లకు పెళ్ళిళ్లైతే కోడళ్ళొస్తారు. వాళ్ళే మన కూతుళ్ళనుకో.... నిన్నూ.... పిల్లల్ని అగాధంలో వదిలేసి వెళ్ళి....పో....తున్నా. నా కళ్ళతో పిల్లల్ని చూడు. నీ ప్రేమలో నా ప్రేమకలిపి ప్రయోజకుల్ని చేయి.మనకున్న ఈ.... ఇ....ల్లూ రెండెకరాల మాగాణీ అమ్మైనాసరే బాగా చ....ది....విం....చు! నాకైతే ఇంకా బతకాలని ఉంది. కా....కాని....నా రెండు కాళ్ళూ విరిగినై. ఎడమ చెయ్యి ఎక్కడ పడిందో తె....లీ .... దు.... పిల్లలు .... నా.... పి....ల్లి....లు.''

అంతే-పంజరమనే శరీరంలోంచి పక్షి అనే ప్రాణం ఎగిరిపోయింది.

ఆ రోజే భర్త సంవత్సరీకం. దినమంతా ఆ మహానుభావుని జ్ఞాపకాలే.

రాత్రి పది కావస్తుంది. తన పక్కనున్న పిల్లలు నిద్రలోకి జారుకుంటున్నారు. ఎంత ప్రయత్నించినా నిద్రాదేవి కరుణించలేదు. పక్క గదిలోంచి మాటలు వినబడుతున్నాయి.

"వైధవ్యం ఎంత భయంకరమో....ఈ రోజు అత్తయ్య కన్నీళ్ళు చెప్పాయండీ!" నాగమణి గొంతు.

"ఔను. నేను కూడా గమనించాను. అమ్మకు నాన్న గుర్తొచ్చుంటాడు" - నారాయణమూర్తి.

"అంతేకాదు. నాకో అనుమానం గూడా!"

"ఏమిటదీ?"

"అత్తయ్య వచ్చినప్పుడల్లా మీరు పనిమనిషిని మాన్పిస్తున్నారు. పెద్దప్రాణంగదా పాపం! అన్ని పనులూ చెయ్యలేక అల్లాడిపోతుందేమోనండీ!...."

"అలాగంటే ఎలా నాగూ! మా అమ్మ వచ్చినప్పుడల్లా మన ఇంటి ఖర్చు పెరుగుతుంది గదాని పనిమనిషికిచ్చే జీతం కలిసొస్తుందని మాన్పిస్తున్నా నంతే! నీ కెందుకా బాధా?"

"అబ్బే....అదేం బాగా లేదండీ! రేపే పనిమనిషిని రమ్మంటాను."

"నీ మొహం, నీకేం దెల్సు? పనిమనిషి పాచిపని, ఇంటిపనంటే చేస్తుందిగాని బట్టలుతకదు గదా? మా అమ్మైతే ఆ పని గూడా చేస్తుందాయె! పనిమనిషుంటే అమ్మకు పని చెప్పాలంటే నీకు నోరురాదు. ఆ బట్టలుతికే పని నీ నెత్తిమీద పడుతుంది. ఐనా .... అమ్మకున్నంత విశ్వాసం ఆ పనిమనిషి కుంటుందా?"

"ఏమోనండి, నాకు మాత్రం...."

"పిచ్చి పిచ్చి ఆలోచనలు మాని పడుకో! నీ కసలు డబ్బు విలువ తెలిసి ఏడిస్తే గదా!"

నారాయణమూర్తి మాటలు ఈటెలై గుండెలకు సూటిగా గుచ్చుకున్నై. బాణం దెబ్బకు నేలకూలిన పావురంలా గిలగిలలాడిందిప్రాణం.

భగవాన్....! నా కొడుకింట్లో నేనో విశ్వాసంగల కుక్క-నన్న మాట? తండ్రిలేని పిల్లల్ని గారాబంగా పెంచింది ఇందుకేనా? చదువుతో పాటు సంస్కారమబ్బుతుందనేది భ్రమేనా? కన్నకొడుకులో కత్తి ప్రేమ! గుండెలు మెలిపెట్టినట్టనిపించింది. నిజానికి ఎవరికి ఎవరీ లోకంలో? తిరుపతి కొండెక్కుతూ కాలుజారి లోయలో పడిపోతున్నట్టనిపించింది.

తెల్లవారకముందే తయారై ఈ ఊరొచ్చింది. అక్కడి సంగతులేవీ పెద్దకొడుక్కు తెలీవింకా.

మరి....చిన్న కొడుకు వెంకటేశో?

వాడో పెద్ద ఇంజనీర్. పక్కా భవనాలను చక్కగా కట్టించగలడు కానీ, తన సంసారమనే భవనాన్ని పునాదులు లేకుండా కట్టెయ్యాలనుకునే అమాయకుడు.

ఏరి కోరి చీఫింజనీర్ ముద్దులపట్టి మణిమాల మెడలో మూడు ముళ్ళేసి ముల్లోకాలు జయించినట్టు మురిసిపోయాడు. పెళ్ళవగానే మెరిట్ లిస్ట్‌లో ప్రమోషన్ కొట్టేశాడు గూడా.

మణిమాల గారాబంగా పెరిగిందట. పాలలో ఎర్ర కుంకుమ కలిపినట్టున్న నున్నటి దేహం. పున్నమి చందమామను వెక్కిరించగల ముఖారవిందము. చారెడేసి కళ్ళు, చెక్కిన ముక్కు....వయసుపొంగుల బుసబుసల్లో పెద్దింటి పిల్లననే అహంకారము కొట్టొచ్చినట్టు కనబడుతుంది. మొగుణ్ణి కొనకొంగుకు ముడేసుకుని సినిమాలకూ, షికార్లకూ, పార్టీలకూ తిరుగుతూంటుంది. ఇష్టం లేకున్నా రత్నంలాంటి రత్నకు తల్లయింది.

"నువ్వు పుట్టి నా అందాన్నంతా కొల్లగొట్టావే ముదనష్టపు మొహమా!"అంటూ పసిదాన్ని ఎన్నోసార్లు చీదరించుకుంది. తల్లి పాలకు నోచుకోలేక రత్న తన పాలైంది. పాల డబ్బాలతో రెండేళ్ళు గడిచినై.

మణిమాల రత్నను చీదరించుకుంటూంటే తన కడుపులో పేగులు కల కలమనేవి. కోపం ముందుకొచ్చేది.

"ఆడదానికి మాతృత్వమో వరం తల్లీ! కన్నపిల్లల్ని స్వయంగా లాలించి పోషించడమో తియ్యని అనుభూతమ్మా!" అందోసారి ఉండబట్ట లేక.

"ఆహాఁ!" మణిమాల మూతి మూడువంకర్లు తిరిగింది. "మాతృత్వ మంటే అదేమన్నా అందాల పోటీల్లో గెలుచుకున్న అపురూపమైన బహుమతా? ఐనా .... ఆ బహుమతి నాగ్గూడా తగిలింది గదా? ఇహ పెంచడమంటారా?....ఇంత పెద్ద బంగళాలో, ఇంతమంది నౌకర్లుండగా, కావల్సినంత డబ్బుండగా, పెంపకానికేం లోటు?" గుండెలతో పాటు ముక్కుపుటాలు లయబద్ధంగా ఎగిరిపడినై. తన మనసు వేడి మంగ లంలో పేలాల్లాగా వేగిపోయింది.

"కాని.... తల్లి ప్రేమ సంగతేమిటమ్మా?"

"దానిమీద ప్రేమలేనిదే పదినెలలు కష్టపడి మోసి కన్నానా?" ముద్దమందారంలాంటి మొహం మంకెనపూవైంది:

"కనడం కాదమ్మా!.... పసిదాన్ని...."

తన మాటలు వినే ఓపికలేక హాండ్‌బాగును వేళ్ళతో ఊపుతూ వెళ్ళిపోయింది.

వెళ్ళిపోతున్న తల్లినీ, తననూ మార్చి మార్చి చూచింది రత్న.

"నానమ్మా!" అంటూ తన ఒడిలో వాల్రింది.

వాసనలేని పూవులా మారిన వెంకటేశం సంసారం ఎట్లా గట్టె క్కుతుందోనని భయమేస్తుంది.

విషయమంతా వెంకటేశ్ చెవిలో వేసి "తల్లిదండ్రుల ప్రేమంటే లాలనా, పాలనా. అంతేకాని, బంగళాలు, నౌకర్లు కాదురా! నీ పని మీద నువ్వెళ్తావు. పనిలేని పనిమీద కోడలు వెళ్తుంది. పసిదాన్ని పట్టించుకునే వాళ్లెవర్రా?" నిలదీసింది.

"నీకు తెలీందేముందమ్మా?" ఆఫీసుకెళ్ళబోతున్న వెంకటేశ్ ఆగి, "మణిమాల కోటీశ్వరులింట్లో పుట్టి కాలికి మట్టి అంటకుండా పెరిగింది. జీవితమనే నాణానికి రెండువైపులా సుఖమనే బొమ్మే ఉంటుందన్న వాతావరణంలో చదివింది. కష్టమనే బొరుసు ఆవిడకు తెలీదు. ఏదో.... మనమే సర్దుకుపోతే సరి" అనేశాడు.

"మన సంగతి కాదురా, అభం-శుభం తెలీని ఆ పసిదాని సంగతి! తల్లిదండ్రుల లాలనకు దూరమైన రత్నను చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతుంది బాబూ!"

"నీకు కష్టమనిపిస్తే చెప్పమ్మా, ఓ ఆయాను కుదుర్చుతాను...."

"ఆయాను తేగలవు కాని, అమ్మప్రేమని...."తన మాట పూర్తిగా వినకుండానే వెళ్ళిపోయిన వెంకటేశ్ సాయంత్రం ఆయాతో తిరిగొచ్చాడు.

లాగి చెంపదెబ్బ కొట్టినట్టనిపించింది.

పసితనమనే మమతల పొలానికి తల్లిప్రేమ గంగాజలం లాంటిది. కృత్రిమమైన ఆయా ప్రేమ సముద్రజలమే కదా?.... కాని, తన అభిప్రాయమెవరిక్కావాలి?.... ఎవరికి ఎవరీ లోకంలో? ఎవరి దారి వారిది.

ఇహ తన అవసరం కనిపించలేదక్కడ.

జరిగిన రోజులు మెదడు పొరల్లో దోబూచులాడుతూంటే

"పోస్ట్!" కేక వినబడింది.

"అన్నపూర్ణమ్మ ఎవరండీ?"

"నేనే బాబూ!"

ఉత్తరం అందుకుని లోపలికి నడిచింది భారంగా.

"అమ్మా!" నలభయ్యేళ్ళ రామనాథం నాలుగేళ్ళ పిల్లాడిలా పిలిచాడు. నిండు వేసవిలో పండువెన్నెల చల్లదనముందా పిలుపులో. అన్నపూర్ణమ్మ కనురెప్పలు పైకిలేచాయి, "ఏమి"టన్నట్టు.

"మూడ్రోజులైతే ఉగాది పండగ...."

"ఔను...." ఇన్‌లాండ్ లెటర్ విప్పింది.

"ఈ పండక్కి నువ్విక్కడే ఉండాలమ్మా!"

అలా ప్రత్యేకంగా అడగడంలో ఆంతర్య మేమిటో? నిజానికి తనక్కడుండాలనే వచ్చింది గదా! ఆవిడ నొసలు ముడిపడి కనుబొమ్మలు ప్రశ్నార్థకాలైనై.

"ఏం లేదమ్మా! .... నన్నూ, నీ కోడల్నూ పండక్కి రమ్మని మా మామగారు ఉత్తరం రాశారు. ఉగాదికి అత్తారింటికి వెళ్ళక ఐదేళ్లైందమ్మా!"

"శుభం, వెళ్ళిరండి."

"పండగ మర్నాడు మా అత్తామామలు కాశీయాత్రకెళ్తున్నారట. మేము గూడా వాళ్ళతో అట్నుంచటే వెళ్ళి రావాలనుకుంటున్నామమ్మా! పిల్లల్తో నువ్విక్కడే ఉంటే...."

"నేను గూడా కాశీయాత్ర కొస్తాన్రా!" గుండెల్లోంచి ఉబికొచ్చిన మాటలు పెదాలు దాటలేదు.

"పిల్లల చదువులై, పెళ్ళిళ్లై స్థిరపడ్డాక మనం హాయిగా కాశీ, రామేశ్వరం తీర్థయాత్రల కెళ్దాం పూర్ణా! "వెంకటేశ్ అక్షరాభ్యాసం

రోజున తనననునయించిన భర్త ఏ లోకాన ఉన్నాడో? ఆనాటి స్వప్న మందిరం ఈ రోజు కూలిపోయింది. కడుపులో చల్లజేసినట్టవుతూంది.

"మీరు తిరిగొచ్చాక నేను వెళ్ళిపోవాలన్న మాట?" అంటూంటే కడుపులో దాగలేని ఎసరు కళ్ళకు పాకింది. కింది పెదవి మునిపళ్ళమధ్య ఇరుక్కుపోయింది.

"అబ్బే .... మా ఉద్దేశ్యమది కాదత్తయ్యా!" రాజ్యలక్ష్మి అందుకుంది: "మీ రెప్పుడూ మా దగ్గరే ఉండాలి, మీ సేవ చేసే భాగ్యం మా సొంతం కావాలత్తయ్యా!"

కళ్ళను కమ్మిన నీటిపొరలు ఉత్తరాన్ని చదవనీయడం లేదు.

"నీ పెద్ద తమ్ముడు నారాయణమూర్తి నుండి ఉత్తరమొచ్చింది చదువు" - అందించింది కొడుక్కి.

"అమ్మ పాదపద్మములకు నమస్కరిస్తూ వ్రాయునది -

అమ్మా! గతవారం రోజులుగా నేను ఒడ్డుకేసిన చేపపిల్లలా కొట్టుకుంటున్నాను. నా వ్యాపార భాగస్వాములు పథకం ప్రకారం నన్ను మోసం చేశారు. ఫలితంగా ముప్పై లక్షల రూపాయల నష్టం తేలింది నా వంతుకు. ఈ షాక్‌కి తట్టుకోలేక నీ కోడలు మంచం పట్టింది. వారం రోజుల్లో ఇల్లు అమ్మేస్తాను. నువ్వు వెంటనే రావాలి. నువ్వొస్తే నాకు కొండంత ధైర్యమొస్తుందమ్మా!...."

ఉత్తరం చదివాడు రామనాథం.

అన్నపూర్ణమ్మ అంతరంగం కొంగలు దొక్కిన మడుగై పోయింది.

"పాపం, తమ్ముడు వ్యాపారమే సర్వస్వమనుకున్నాడు గదా!" రామనాథం మాటల్లో దాగున్నది సానుభూతో, వెక్కిరింపో అర్థంకాలేదు.

"టెలిగ్రాం.... అన్నపూర్ణమ్మ గారికి టెలిగ్రాం...." టెలిగ్రాఫ్ మెస్సెంజర్ సైకిల్ గంట గణగణా మోగింది.

"రత్న సీరియస్, డాక్టర్స్ అడ్వైజ్ యువర్ ప్రెజెన్స్ కంపల్సరీ ఫర్‌హర్ రికవరీ, అదర్‌వైజ్ డేంజర్ - వెంకటేశ్."

రామనాథం చదివిన టెలిగ్రాం పూర్తిగా అర్థంకాకపోయినా అందులో ఆపద సమాచారమేదో ఉందని తెలిసిపోయింది.

"అంటే ఏమిట్రా?" గుండె గుబగుబ లాడింది.

"వెంకటేశ్ కూతురు రత్నకేదో జబ్బుముంచుకొచ్చిందట. అది కోలుకోవాలంటే నువ్వక్కడుండాలట. లేకపోతే అపాయమన్నారట డాక్టర్లు."

"అరెరే....దైవోపహతురాలు!....నామీద బెంగబెట్టుకుందేమో...." అన్నపూర్ణమ్మ కళ్ళల్లో రత్నతళుక్కుమంది.

ఇప్పుడేం చెయ్యాలి?

'ముగ్గురు కొడుకుల పిల్లల్లో నా రక్తముంది. కాని....ఎవరి బాగోగులు వారే చూచుకుంటున్నారు గదా! ఎటూ వెళ్ళకుండా మెదల కుండా ఉంచే సరి! నేనూ కాశీయాత్ర కొస్తానని రామనాథంతో ఖచ్చితంగా చెప్పేస్తే అయేదేముంది? ఎవరికెంత చేసినా ఇంకా చేయించుకోవాలనునేవాళ్ళే. తీర్థయాత్రలకెళ్ళే అవకాశం నాకెక్కడుందీ? ఔను... ఎవరి స్వార్థం వారిది. ఎవరి మోక్షమార్గం వాళ్ళు వెతుక్కోవాల్సిందే....'

అన్నపూర్ణమ్మ ఆలోచనలను చీల్చుతూ ఆలిండియా రేడియో గీతా మకరందం ప్రసారం చేస్తుంది....

"తస్మాదసక్తస్సతతం కార్యం కర్మ సమాచర అసక్తోహ్యాచరన్ కర్మ పరమాప్నోతి పూరుషః....

అర్జునా! నీవు ఫలాపేక్షలేనివాడవై చేయదగిన కర్మను ఎల్లప్పుడు చక్కగా చేయుచుండుము. నిరాసక్తుడై కర్మ నాచరించు మనుజుడు మోక్షమునే పొందుచున్నాడు...."

ఘంటసాల గంధర్వగానము అన్నపూర్ణమ్మ హృదయపులోతుల్ని తట్టింది. అంతరంగములోని సముద్రఘోష చల్లబడిపోయింది.

"నేను వెంటనే వెంకటేశ్ దగ్గరికెళ్తాను!" దృఢ నిర్ణయం వెలువడింది.

అతుకులబొంత జీవితానికి తృప్తి అనే బెడ్‌షీట్ అమరింది.

(అన్వేషణ వారపత్రిక 26 జూలై 1995)